క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే తనయుడు దినేష్



మడకశిర: అమరావతిలోని అసెంబ్లీ హాల్‌లో సోమవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి తనయుడు డాక్టర్ దినేష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. మర్యాద పూర్వంగా ముఖ్యమంత్రిని కలిసినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఎంతో ఆప్యాయంగా తనను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



గిరియమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ స్వాతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని జీవీపాళ్యం గ్రామానికి చెందిన వలంటీర్ స్వాతి బెంగళూరుకు వెళ్లి వృద్ధురాలు గిరియమ్మకు రూ.3 వేల పింఛన్‌ను సోమవారం అందజేశారు. గిరియమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ స్వాతి బెంగళూరుకు వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు.

వారపు సంత వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి వారపు సంత వేలం పాటను సోమవారం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. రాజు అనే వ్యక్తి రూ.37,700 పాట పాడి దక్కించుకున్నారని గ్రామ కార్యదర్శి నర్సేగౌడ్, సర్పంచ్ నర్సేగౌడ్ తెలిపారు.

18 నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

అమరాపురం: బోరుబావులు తవ్వించడంతో పాటు దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రభుత్వం 18 కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ సిద్దేశ్వర తెలిపారు. సోమవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైన రైతులకు స్లిప్పులు అందించారు. మంగళవారం నుంచి ఆయా రైతుల పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఐ యుగంధర్

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామంలో ఉన్న పోలింగ్ స్టేషన్‌ను సీఐ యుగంధర్, ఎస్ఐ విజయ్‌కుమార్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి గ్రామస్తులు సహరించాలని సీఐ కోరారు. శాంతి భద్రతల సమస్యలు ఏమైనా ఉత్పన్నమైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరిని ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను కలిసిన కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

హిందూపురం: పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను మర్యాదపూర్వకంగా కలిశారు.

వ్యక్తికి గాయాలు

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం కగ్గల్లు గ్రామానికి చెందిన అబ్దుల్ వజీద్ సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మసీదుకు వెళ్తుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స నిమిత్తం 108 ద్వారా హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

నూతనోత్సాహం



- పేదవాడిని సమన్వయకర్తగా నియమించడంతో టీడీపీలో వణుకు
- ప్రజలతో మమేకమవుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప
- మంత్రి పెద్దిరెడ్డి పర్యటనతో పార్టీ శ్రేణుల్లో జోష్
- టికెట్‌పై స్పష్టత లేక టీడీపీ క్యాడర్ సతమతం
- కత్తులు దూసుకుంటున్న ఈరన్న, గుండుమల వర్గాలు

మడకశిర: జిల్లాలో పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉన్న మడకశిర అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలో జోష్ పెరుగుతోంది. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా పార్టీ హైకమాండ్ పేదవాడైన ఈర లక్కప్పను నియమించింది. ఈ నేపథ్యంలో టీడీపీలో వణుకు మొదలైంది. వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా ముందుకు దూసుకుపోతుంటే ప్రతిపక్ష టీడీపీ పూర్తిగా డీలా పడిపోయింది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి నాయకులు, కార్యకర్తలను కలుస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా పార్టీ క్యాడర్ ఈర లక్కప్పకు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరుతున్నారు. ఈర లక్కప్ప పర్యటనకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండడంతో పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం పెరుగుతోంది.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనతో ..

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మడకశిర నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఆయన ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించారు. మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురంలో జరిగిన కార్యకర్తల సమావేశాల్లో పాల్గొని దిశానిర్దేశం చేశారు. మంత్రి పర్యటన గ్రాండ్ సక్సెస్ కావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. నియోజకవర్గంలోని ముఖ్యమైన నాయకులను ఆయన సమన్వయం చేశారు. కలిసికట్టుగా పని చేసే విధంగా నాయకులను సిద్ధం చేశారు. ప్రస్తుతం మంత్రి సూచన మేరకు నియోజకవర్గంలోని నాయకులందరూ వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి కృషి చేస్తున్నారు.



ఇటీవల మడకశిర పర్యటనలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్పను పరిచయం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)

టీడీపీలో గందరగోళం

మడకశిర టీడీపీలో అయోమయం, గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత వరకూ పార్టీ టికెట్‌పై హైకమాండ్ నుంచి స్పష్టత రాలేదు. తనకే టికెట్ వస్తుందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న , ఎట్టి పరిస్థితిలో కూడా ఈరన్నకు టికెట్ రాదని, తమ వర్గానికే టికెట్ వస్తుందని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అంటున్నారు. రెండు వర్గాల మధ్య రాజీ కుదర్చడానికి చంద్రబాబు పలుసార్లు పంచాయితీలు చేసి ఫలితం లేకపోయింది. ఇలా రెండు వర్గాల మధ్య పార్టీ క్యాడర్ సతమతమవుతోంది.

పార్టీ మారే ఆలోచన..

టీడీపీ అధిష్టానం టికెట్ ప్రకటించిన వెంటనే ఆ పార్టీలో కుదుపు రావడం తథ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టికెట్ రాని వర్గం పార్టీ మారే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేకుల అభిప్రాయం. ఇప్పటికే ఇరు వర్గాల నాయకుల మధ్య మాటలు కూడా లేవు. ఇలాంటి పరిస్థితిలో ఇరు వర్గాలు కలిసి పనిచేసే అవకాశం లేదని చెబుతున్నారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళి



ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ



వడ్డె ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వేణురెడ్డి

హిందూపురం: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న చిరస్మరణీయులని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ అన్నారు. హిందూపురం శ్రీకంఠాపురం సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డెర కుల గురువు వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ జె.మల్లికార్జున, చంద్రశేఖర్, డిష్ చాంద్, హిదాయత్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న సేవలు మరువలేనవని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి కొనియాడారు. వడ్డె ఓబన్న విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు గిరి, నాగేంద్రబాబు, మల్లికార్జున, రహమత్ బి, నాగేంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ బీబ్లాక్ కన్వీనర్ బెల్లం నరేష్, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి

మడకశిరరూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. సోమవారం ఆయన మడకశిర మండలంలోని మెళవాయి, బుళ్లసముద్రం పంచాయతీల్లో ఆయన పర్యటించారు. జిల్లా ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల వారిని కలిసి మద్దతు కోరారు. ఈర లక్కప్ప మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేసి మరోసారి వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, ఎంపీటీసీ హనుమంతరాయప్ప ,నాయకులు పాల్గొన్నారు.



ఏడీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు ఆనంద రంగారెడ్డిని కలిసిన ఈర లక్కప్ప

మంగాపురంలో క్లీన్ అండ్ గ్రీన్

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని మంగాపురం గ్రామంలో పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మంగాపురం నుంచి కోనాపురం వరకూ ముళ్ల చెట్లను తొలగించారు. అనంతరం తాగునీటి ట్యాంకుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, లెక్చరర్ నరసింహమూర్తి, పీఓ శంకర్ నాయక్ తదితరలు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

మడకశిరరూరల్: మండలంలో వేసవిలో గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్తగా ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి తెలిపారు. సోమవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో బోరు వేసేందుకు పూజ చేశారు. బోర్లలో తక్కువ నీరు వస్తున్న గ్రామాల్లో జేజేఎం కింద బోర్లు వేసి మోటార్లు అమర్చి ,పైపులైన్ ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు.

క్యాన్సర్‌పై కార్మికులకు అవగాహన



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పరిగి: క్యాన్సర్ బారిన పడకుండా ఆహారపు అలవాట్లను మార్చుకోవాని డాక్టర్ యాస్మిన్ తెలిపారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పరిగిలోని ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమలో మహిళా కార్మికులతో సోమవారం బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన కల్పించారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏజీఎం మహేష్, జీఎం వెంకటేష్, హెచ్ఆర్ఎం గంగాధర్, గైనకాలజిస్ట్ డాక్టర్ నందిత, డెర్మటాలజిస్ట్ డాక్టర్ సంధ్యారాణి, చిన్న పిల్లల వైద్య నిపుణులు దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన పులమతి విద్యార్థినులు

లేపాక్షి: 'ఆడుదాం ఆంధ్ర' జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. మొదటి స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వ్యాయమ ఉపాధ్యాయుడు రామాంజినేయులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. అలాగే ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బాలుర విభాగంలో రెండోస్థానం సాధించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ప్రిన్సిపల్ మహబూబ్‌సాబ్, ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌బాబు, సిబ్బంది అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

చిలమత్తూరు: మండల నూతన తహసీల్దార్‌గా భాగ్యలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. భాగ్యలత మాట్లాడుతూ భూ సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సోమందేపల్లి: మండల తహసీల్దార్‌గా అంజనాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవన్యూశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

లేపాక్షి: మండల తహసీల్దార్‌గా బాలనరసింహుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప జిల్లా తొండూరు తహసీల్దార్‌గా పనిచేస్తు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

గుడిబండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా ఏ.ప్రతాప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గోరంట్ల: మండల నూతన తహసీల్దార్‌గా సోమవారం అక్బల్‌బాషా భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగే విధంగా కృషిచేస్తానని పేర్కొన్నారు.

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా ఎస్.భద్రుజమ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది అన్ని విధాలా సహకరించాలని కోరారు. రైతులు భూసమస్యలు వంటి ఏమైనా ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని సూచించారు.

రొద్దం: మండల తహసీల్దార్‌గా ఎం లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తామని చెప్పారు.

మడకశిర: మడకశిర నూతన ఎంపీడీఓగా దాసరి మేరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు కార్యాలయ ఏఓ ఆరాధ్య, సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దాసరి మేరి మాట్లాడుతూ మండలంలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

మడకశిర: మడకశిర అర్బన్ సీఐగా మనోహర్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మనోహర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పెనుకొండ రూరల్: కియా పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా జి.రంగడు బాధ్యతలు చేపట్టారు. డీ.హీరేహాళ్ నుంచి ఆయన కియా పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రంగడు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడతానని తెలిపారు.

లేపాక్షి ఆలయానికి భద్రత కల్పించండి

హిందూపురం: లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి దేవాలయం వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ డీఎస్పీ కంజాక్షన్‌ను కోరారు. సోమవారం హిందూపురం డీఎస్పీ కార్యాయలంలో కంజాక్షన్‌ను కలిసి పుష్పాగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆలయ భద్రత, పరిస్థితులను వివరించారు. ప్రతి శుక్ర, శని, ఆదివారం మూడురోజులు ఆలయానికి భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. లేపాక్షిలో పర్యాటక పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఆ స్టేషన్‌కు ఇప్పటి వరకు పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించలేదన్నారు. ప్రతి వారం శుక్ర శని ఆదివారాల్లో భక్తులు రద్దీ చాలా ఎక్కువగా ఉంటుందని ఇలాంటి సమయంలో ఆలయ ఆవరణంలో వాహనాల పార్కింగ్, ఆలయ పరిసరాలు, ఆలయ వెలిపల దొంగలు సంచరిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అందువల్ల పోలీసు సిబ్బంది పర్యవేక్షణ పెంచి భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. స్పందించిన డీఎస్పీ వారం రోజుల్లో సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు.



డీఎస్పీ కంజాక్షన్‌కు వినతిపత్రమిస్తున్న రమానందన్

డీఎస్సీ ప్రతిపాదనపై హర్షం

హిందూపురం టౌన్: ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా మంత్రి మండలి డీఎస్సీ ప్రతిపాదనను ఆమోదించడంపై ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్సీ పోస్టులను మరింత పెంచాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టి డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పోస్టుల కోసం లక్షలాది మంది ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం విడుదల చేసిన 6,100 పోస్టులతో కాకుండా 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, తాలూకా నాయకులు దేవరాజ్, వేణుగోపాల్, వరుణ్, పవన్, కార్తీక్, గోపి, బాలాజీ, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో చదివించండి

రొళ్ల: తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హులికుంట, వన్నారనపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. తర్వాత విద్యార్థులకు సంబంధించిన హోం వర్క్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

సంఘాల పనితీరుపై సమీక్ష

అమరాపురం: మండలంలో మహిళా సంఘాల పనితీరు మెరుగుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మడకశిర ఏరియా కోఆర్డీనేటర్ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఏ గ్రేడులో ఉన్న ప్రతి సంఘానికి రుణాలను విరివిగా మంజూరు చేయాలని సీసీలను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పథకాలను సంఘ సభ్యులకు తెలియజేయాలన్నారు.

జాతరకు తరలిరండి

పావగడ: దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లిలోని మహర్షి వాల్మీకి గురుపీఠంలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న జాతరోత్సవం, శ్రీమఠం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. వేడులకు వాల్మీకులు అధిక సంఖ్యలో తరలిరావాలని వాల్మీకి జాతర ప్రచార సమితి అధ్యక్షుడు నారాయణ మూర్తి తెలిపారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

మడకశిర: అనంతపురం పట్టణ శివారు ప్రాంతంలో ఈనెల 10న జరగనున్న వైఎస్సార్‌సీపీ సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప ఒక ప్రకటనలో కోరారు. సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తారన్నారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయడానికి ఈసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. మడకశిర నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

పాత నేరస్తులపై దృష్టి సారించండి

సోమందేపల్లి: పాత కేసుల్లో నేరస్తులుగా ఉన్న వారి కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఐ యుగంధర్ సూచించారు. సోమవారం స్థానిక పోలీస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లను బైండోవర్ చేసి సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలని ఎస్ఐ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. అలాగే కర్ణాటక మద్యం, పేకాట నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు చింత ఫల సాయం

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగల్ గ్రామ పంచాయతీ ఆధీనంలోని చింతఫలసాయంతో పాటు చేపల చెరువుకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు సచివాలయం ఆవరణలో వేలం పాటను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తిప్పేస్వామి, కార్యదర్శి రమేష్ తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్తులు చేపల చెరువుకు రూ.25 వేలు, చింతఫల సాయానికి రూ.5 వేలు ముందస్తుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయంలో సోమవారం ఆ గ్రామంలో ఉన్న చింత ఫలసాయాన్ని సర్పంచ్ తిప్పేస్వామి, కార్యదర్శి భార్గవి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు రూ.37,500కు వేలం పాటను దక్కించుకున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గణితం, ఫిజికల్ సైన్స్, బయాలజీపై డివిజనల్ స్థాయి స్టిములేషన్ సాఫ్ట్‌వేర్ శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్, ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ విద్యార్థులకు మెళకువలతో బోధిస్తే గణితం, ఫిజికల్ సైన్స్, బయాలజీ పాఠ్యాంశాల్లో మరింతగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ సామ్రాజ్యం, రిసోర్స్ పర్సన్ మాలిక్, కిరణ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం హక్కుగా కల్పించాలి

హిందూపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలందరికీ ఆరోగ్యాన్ని హక్కుగా కల్పించాలని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఇందిరా పార్కులో యూనియన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా జనరల్ కౌన్సిల్ సమావేశాలు, రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైట్ టూ హెల్త్ నినాదంతో ఈ నెల 7 నుంచి 11 వరకూ ఆల్ ఇండియా జనరల్ కౌన్సిల్ సమావేశాలు, రాష్ట్ర సమావేశాలు విజయవాడలోని ఎంబీవీకే భవన్‌లో జరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక యూనియన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రామ్మూర్తి, కోశాధికారి మునీర్, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రారంభం



హేమావతిలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్న దృశ్యం

అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరాపురం మండలంలో నవరత్నాల పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇళ్ల పట్టాలు పొందిన వారికి సచివాలయంలో కార్యదర్శుల ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను లక్షాధికారులను చేయాలనే ఉద్దేశంలో ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.